కవితా కౌముది

# చిన్నిచిన్ని ఆశ

రవిప్రసాద్ చెలమల్లు

శిశిరానికి నిలువు దోపిడినిచ్చిన తరువు
మారాకులతో వసంతాన్ని పులుముకుంది

అడవి అడవంతా వేసంగికి వడలిపోతే
మోదుగ ఒక్కటి, ఆగ్నిపూలు పూచింది

వాలుతున్న పొద్దు, పొడిచే చుక్కల
మిలమిలతో తళుకులీనుతుంది

పొక్కిల్లిన వాకిలి, వేకువనే చల్లిన
కళ్ళాపితో కొత్త కళ సంతరించుకుంది

ప్రతి ఓటమి చివర, దోబూచులాడుతూ
ఓ కొత్త ఆశ దాగి ఉంటుంది

వెలికి తీసే ఓరిమి తోడుగా, తరచి చూస్తే
రేపటి ఉదయంతో పనిలేదు
ఈ రోజు వెన్నెల చాలనిపిస్తుంది

★★★

# బతుకు చట్రం

బాలాజీ పోతుల

మనసుకు ముళ్ళు గుచ్చుకున్నవి,
ఉడుకుడుకు ఉల్లిగడ్డ కట్టి,
బయటికి తీద్ధామంటే,
దానికంటూ ఓ చోటు లేదాయే!

నల్ల చారలు ఉన్న కుక్కొక్కటి,
కాళ్ళు కాలిన పిల్లోలే తిరుగుతున్నది.
దానికంటూ ఉంటానికి ఓ గూడు లేదాయే!

అసలే చలికాలం –
నేలని కొంతమేర తవ్వి,
నాలుక్కాళ్ళూ ముడుచుకుని పందామంటే,
ఓ రెండడుగుల నేలైనా తనది కాదాయే!

అవే నల్లని చారలు ఉన్న పిల్లి ఒకటి,
మ్యావ్, మ్యావ్ అనుకుంటూ,
ఓ ఇంట్లోంచి బయటికొచ్చింది,
తనకంటూ ఓ ఇల్లుంది.
ఒకటేంటీ, చాలానే ఉన్నాయి!

ఏ ఆదివారం నాటి మధ్యాహ్నమో –
ఎవరో ఒకరు చికెన్ ముక్క ఒకటి,
తన మొఖాన కొట్టకపోతారా? అని
దేవులాడుకుంటా తిరుగుతది.

నాకన్నా పిల్లి బతుకే నయం అనుకుంటా,
కుక్క - ఆ పిల్లికేసే ముక్కల మీద కన్నేస్తది.
బౌవ్ బౌవ్ అరుపులతో ఆ ముక్కలన్నీ
కడుపులేసుకుంటది.

ఈ బతుకు పోరాటంలో ఒక జీవి -
ఇంకో జీవికి శత్రువే!
ఒక కడుపు నిండితే -
ఇంకో కడుపు పస్తులే!

ఇదే బతుకు చట్రం,
జీవిత రేఖల్ని చీరే అస్త్రం!

★★★

# ఏ రోజు ఏలాంటిదో..!?   చందలూరి నారాయణరావు

ఖాళీగా మ్రోగే
మనిషి బరువు
మాములు కన్నా రెట్టింపు...

భరించలేని రాత్రి
నష్టపోయే నిద్ర
అంతకు మించే ఉంటుంది...

లోకం గొలుసు
తెంచుకున్న కుక్కలా
పైకి ఎగబాకుతుంటే

కాలం కళ్ళు
మూసుకున్న పిల్లిలా
ఎటు దూకుతుందో  భయం.

కాంపౌండు వాల్ లేని
జీవితానికి
ఏ రోజు ఎలాంటిదో?

ఏ ఆలోచన కాపలా కాసినా సరే
మోసం చేసే క్షణం ముందు
బానిసే సమస్తం....

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇది యుషఃకాలమెల్లెడనిరులు నిండె
ప్రాగ్దిశనరుగుదెంచడు భాస్కరుండు
పలుకరెవరింకనినునకు స్వాగతమ్ము
మిన్నుమనుచుండె తారలు మింటిసీమ

పుడమిపై మిణుగురులు కన్పడుచునుండె
కనులకింపైన దేదీప్యకాంతితోడ
ఓ ప్రభాతమా! ఆగుమా యొక్క ఘడియ
కొలదిసేపే ప్రకృతిశోభ గ్రోలనిమ్ము

ఈ మినుకు మిన్కు తారలు నిరులు వలయు
ఈ ప్రశాంతనిశ్శబ్దమాశింతునిపుడు
వడిగదాకు పుడమియలజడులనుండి
క్షణము నా మదికింత విశ్రాంతినిమ్ము

తరణితో వచ్చు శ్రావ్యనాదములు కొన్ని
వాని మించినవేవొ సవ్వడులు కొన్ని
ప్రవిమలతరమనోజ్ఞరావములు కొన్ని
ధరణి మేల్కొన పైకొను ధ్వనులు కొన్ని

శ్రవణములదాకు మంగళస్వరములైన
వివిధరీతులనిలనిండు రవములైన
మనసు నిశ్శబ్దశబ్దసమాధియందు
లీనమైపోవుటే యద్భుతానుభవము

COMMENTS